పల్లెపండుగ సరే.. పనుల మాటేమిటి?

- ప్రారంభం కాని సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు
- నియోజకవర్గంలో రూ.15.46 కోట్లతో 236 పనులు మంజూరు
- ఇసుక లేకపోతే పనులు ఎలా ప్రారంభించాలంటున్న కాంట్రాక్టర్లు
- ఇసుక, సిమెంట్ ధరలపై కొరవడిన స్పష్టత
- సిమెంట్ బస్తా మార్కెట్‌లో రూ.350పైగానే.. రూ.270 చెల్లిస్తామంటున్న ప్రభుత్వం
- పనులు ప్రారంభించేందుకు జంకుతున్న కాంట్రాక్టర్లు
- కొన్ని గ్రామాలకే నిధులివ్వటంపై సర్పంచుల అసహనం




తాటిపాడులో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య (ఫైల్), జూపాడుబంగ్లాలో సీసీ రోడ్డు వేయాల్సిన ప్రాంతం

జూపాడుబంగ్లా: పల్లెపండుగ కార్యక్రమం ముగిసి పదిరోజులైనా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పాములపాడు, పగిడ్యాల, కొత్తపల్లి, నందికొట్కూరు, మిడుతూరు మండలాల పరిధిలో 77 గ్రామ పంచాయతీలుండగా వాటిల్లో కేవలం 44 పంచాయతీలకు మాత్రమే 236 పనులకు రూ.15.42 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవటంతో ఆయా గ్రామాల సర్పంచులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా సంక్రాంతి నాటికి పనులన్నీ పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అయితే నిర్మాణాలకు 75 రోజులు మాత్రమే ఉంది. ఇప్పటికే పనులు చేపట్టాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదు.

మండలాల వారీగా గ్రామాలకు మంజూరైన పనులు, నిధుల వివరాలు..

మండలంపేరు	మొత్తం గ్రామాలు	పనులు మంజూరైన గ్రామాలు	మంజూరైన పనుల సంఖ్య	మంజూరైన మొత్తం (రూ.కోట్లల్లో)
జూపాడుబంగ్లా	12	05	36	రూ.2.50
నందికొట్కూరు	12	08	42	రూ.2.82
పగిడ్యాల	08	06	35	రూ.2.50
మిడ్తూరు	19	07	32	రూ.2.45
పాములపాడు	14	09	43	రూ.2.65
కొత్తపల్లి	12	09	48	రూ.2.50
మొత్తం	77	44	236	రూ.15.42

236 పనులకు రూ.15.42 కోట్లు..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 236 పనులు చేపట్టేందుకు రూ.15.42 కోట్లు ఉపాధి హామీ పథం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను వెచ్చించి గ్రామాల్లో నిర్ణీత ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు చేపట్టేందుకు పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భూమిపూజ చేశారు.

33 గ్రామాలకు మొండిచెయ్యి..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 77 గ్రామ పంచాయతీలుండగా అందులో కేవలం 44 గ్రామ పంచాయతీల్లో మాత్రమే సిమెంటురోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, తమ గ్రామపంచాయతీల నుంచి ఎలాంటి తీర్మాణాలు తీసుకోకుండా, తమ గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవటం సబబుకాదని సర్పంచులు మండిపడుతున్నారు.

డిసెంబర్ నాటికి పనులు పూర్తిచేస్తాం

కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఇసుక సమస్యలేకుండా ఇప్పటిదాకా 140 టన్నుల ఇసుకను సాధారణ వినియోగదారుల కోటాలో బుక్‌చేశాం. బల్క్ ఇసుక బుకింగ్ సైట్ ఓపెన్ అయిన వెంటనే బల్క్‌గా ఇసుకను బుక్‌చేసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఇబ్బందిలేకుండా చేస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు సిమెంటు బస్తాకు రూ.270 కేటాయిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాం. మిగిలిన గ్రామాల్లో వెంటనే ప్రారంభించి డిసెంబర్ నెలాఖరులోపు పూర్తిచేయిస్తాం.

– ధనిబాబు, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ, నందికొట్కూరు

తేలని సిమెంట్, ఇసుక ధర..

క్వారీల వద్దకు వాహనాలు తీసుకెళ్లి ఫ్రీగా ఇసుక తీసుకెళ్లవచ్చని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొంటుండగా.. సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఇసుక లభించటం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనికి తోడు బహిరంగ మార్కెట్లో సిమెంటు బస్తా ధర రూ.350 పైబడి పలుకుతుండగా ప్రభుత్వం రూ.270 చొప్పున చెల్లిస్తామని పేర్కొనడంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ఆలోచిస్తున్నారు.

ప్రారంభం కాని సిమెంటు రోడ్లు..

వందరోజుల ప్రణాళికల్లో భాగంగా మంజూరైన సిమెంటు రోడ్లు, డ్రైనేజీల పనులను డిసెంబర్ నెలాఖరులోగా పనులను పూర్తిచేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటి దాకా పనులు ప్రారంభించకపోవటంతో పాటు ఇసుక కొరత నెలకొన్న నేపథ్యంలో రోడ్ల నిర్మాణ పనులు ఆ లోపు పూర్తిచేయలేకపోవచ్చని కాంట్రాక్టర్లు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

కోనేరుల వద్ద సిమెంట్ ప్లాట్‌ఫామ్



కోనేరు వద్ద సిమెంట్‌తో ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలోని కోనేరుల వద్ద ప్లాట్‌ఫామ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చిన్న కోనేరు వద్ద మురుగు నీరు నిలిచి భక్తులు జారిపడుతుండటంతో 'మహానందీశా.. ఏంటీ దుస్థితి' శీర్షికన సాక్షి ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులు చేపట్టారు. మురుగు నీరు తొలగించి గత రెండ్రోజుల నుంచి సిమెంట్‌తో ప్లాట్‌ఫామ్ పనులు చేయిస్తున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టార్ యూత్ అసోసియేషన్, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 3న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఈఓ హసన్ తెలిపారు. కెడం ప్రసాద్ హాస్పిటల్ నుంచి డాక్టర్లు కే దుర్గాప్రసాద్, ఎం హిమబిందు హాజరై వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నందికొట్కూరు: తెలంగాణ మద్యం తెచ్చే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఎస్ఐ జబ్రూల్లా హెచ్చరించారు. గురువారం మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో బోయ శివకుమారి, మల్యాల గ్రామానికి చెందిన ఎర్రమల నాగరాజు వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన 16 మద్యం బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో సూర్యనారాయణ గౌడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.85,226 చెక్కును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ప్రాత కోట గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్‌దారులకు నగదు అందజేశారు.

జూపాడుబంగ్లా: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. గురువారం మండలంలోని పి.లింగాపురం, పారుమంచాల గ్రామానికి చెందిన ఊటుకూరు శ్రీలక్ష్మి, పారుమంచాల గ్రామానికి చెందిన దూదేకుల రిజ్వాన అనే మహిళలు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. వారు ఎమ్మెల్యే సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కోసం దరఖాస్తు చేసుకొన్నారు. శ్రీలక్ష్మికి రూ.5,85,755, రిజ్వానాకు రూ.1,45,000 చొప్పున మంజూరయ్యాయి. వాటిని ఎమ్మెల్యే వారికి అందజేశారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి

మిడుతూరు: గొడవల జోలికి వెళ్లకుండా గ్రామాల్లో ప్రశాంత జీవనం గడపాలని ఎస్ఐ ఓబులేసు సూచించారు. శుక్రవారం మండలంలోని 49– బన్నూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడారు. చెడు వ్యసనాలకు లోను కాకుండా జీవనోపాధులను మెరుగుపరచుకోవాలన్నారు. పేకాట, మట్కా, మద్యం సేవించడం ద్వారా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని చెప్పారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, ఇందుకు వారికి మంచి విద్య అందేలా చూడాలన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలి

పాములపాడు: వడ్డెరలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలని ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1972లో వడ్డెరలను ఎస్టీ జాబితాలోంచి తొలగించి తీరని అన్యాయం చేశారన్నారు. వడ్డెరలకు ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పటేల్ జయంతి

నందికొట్కూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరవలేనివని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం పట్టణంలోని పటేల్ విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా దామోదర్‌రెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈపీఎఫ్ జమ చేయాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల ఖాతాలో ఈపీఎఫ్ జమ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.2016 నుంచి 2019 వరకు జీతంలో కార్మికుల జీతంలో ఈపీఎఫ్ కట్ అయినా కార్మికుల ఖాతాలో జమ కాలేదని, పీఎఫ్‌లో జరిగిన అవకతవకలపై విచారించి కార్మికులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

టేబుల్ ఫ్యాన్ విరాళం

మహానంది: మహానంది దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ పి.సుబ్బారెడ్డి అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం రూ.3 వేల విలువ చేసే టేబుల్ ఫ్యాన్ విరాళమిచ్చారు.

బడి సమీపంలోనే మద్యం దుకాణం



జూపాడుబంగ్లాలో బడికి సమీపంలో ఉన్న మద్యం దుకాణం

జూపాడుబంగ్లా: గడువుదాటినా మండల కేంద్రంలోని మద్యం దుకాణం బడి సమీపంలోనే కొనసాగిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పదిహేను రోజుల క్రితం మండల కేంద్రంలో ప్రైవేటు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న మద్యం దుకాణంలోనే ప్రస్తుతం తాత్కాలికంగా మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. వంద మీటర్ల కంటే తక్కువ దూరంలో దుకాణం ఉన్నందున అక్టోబర్ నెలాఖరులోగా మరోచోట ఏర్పాటు చేసుకోవాలని నందికొట్కూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ రామాంజనేయులు దుకాణాదారులకు సూచించారు. అయితే గడువుదాటినా బడి సమీపంలోనే మద్యం దుకాణం కొనసాగుతోంది.ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, దుకాణ దారుల వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో మార్చుతామని తెలిపారు.

అంగన్‌వాడీ భవనానికి తాళం



ఒకటో అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: స్థానిక ఒకటవ అంగన్‌వాడీ కేంద్రానికి గుడి పూజారి తాళం వేయటంతో సమస్య పోలీసుస్టేషన్‌కు చేరింది. గ్రామంలోని బొడ్రాయి సమీపంలో ఉన్న ఒకటవ అంగన్‌వాడీ కేంద్రాన్ని రెండు మాసాల క్రితం సంతగేటు ఆవరణలోని మహిళా మండలి భవనంలోకి మార్చి అక్కడే నిర్వహించసాగారు. అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతుల నిమిత్తం రూ.3వేలు, తాగునీటి కుళాయి ఏర్పాటుకు రూ.17వేలు మంజూరయ్యాయి. కుళాయి పనులు ప్రారంభించగా అంగన్‌వాడీ కేంద్రం వెనకాల ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పూజారి గాలెన్న..ఆ భవనం తనదంటూ తాళం వేసుకొన్నాడు. ఈ విషయమై అసిస్టెంట్ సీడీపీఓ మంగవల్లి, సూపర్‌వైజర్ పావనిరెడ్డి విషయాన్ని ఎస్ఐ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం తలుపులు తెరచుకోకపోవటంతో కుళాయి ఏర్పాటు పనులు నిలిచిపోయాయి.

ఊరూరా దీపావళి వేడుకలు



గువ్వలకుంట్లలో టపాకాయలు వెలిగించి సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

కొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో గురువారం దీపావళి పర్వదిన వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సాయంకాలం నుంచి టపాకాయలు సంబరాల్లో మునిగితేలారు.

జూపాడుబంగ్లా: దీపావళి పర్వదినాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. పలువురు నోములు, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్ల ముంగిళ్లను దీపాలతో అందంగా అలంకరించారు.టపాసులను పేల్చి సంబరాలు జరుపుకొన్నారు.

నందికొట్కూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భక్తు లు గురువారం దీపావళి సంబరాలు అంబరన్నంటాయి. బాణ సంచా పేల్చి సంబరాలు పంచుకున్నారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళి పండుగను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్ని, పెద్దా తేడా లేకుండా బాణా సంచా కాల్చి సందడి చేశారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గురువారం దీపావళిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు దీపాలు వెలిగించారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా బాణాసంచా పేల్చి వేడుకలు చేసుకున్నారు.

మహానంది: దీపావళి పర్వదినం సందర్భంగా గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని నవగ్రహ ఆలయాలు, గంగా గౌరీ సమేత మరకతలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. రాత్రి ధనలక్ష్మి పూజలో భాగంగా కరెన్సీ నోట్లను వృత్తాకారంలో పేర్చి దీపలక్ష్మి పూజ చేశారు.

దుప్పుల మృతిపై ఉన్నతాధికారుల విచారణ

మహానంది: నల్లమల చలమ బీట్‌లో ఉన్న డోల్ బేస్ క్యాంప్, నెమలినార మాను ప్రాంతంలో చుక్కల దుప్పులు మృతి చెందిన ఘటనలపై ఎఫ్‌డీపీటీ కృష్ణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనన్‌లు వారం క్రితం ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం రాజమండ్రి, కాకినాడ, తదితర ప్రాంతాల నుంచి 29 చుక్కల దుప్పులను తెచ్చారు. డీర్ ఎన్‌క్లోజర్‌లో కొద్దిరోజులు ఉంచి అనంతరం డోల్ బేస్ క్యాంపు ప్రాంతంలో వదిలేశారు. వాటిలో అనారోగ్యం, పలు కారణాలతో మూడు చనిపోగా పోస్టుమార్టం నిర్వహించారు. మరో మూడు వేట కుక్కల దాడిలో మృతి చెందినట్లు సమాచారం. నిబంధనల మేరకు మృతి చెందిన వన్య ప్రాణులకు పోస్టుమార్టం నిర్వహించి దహనం చేయాల్సి ఉంది. అలాంటిదేమీ లేకుండా డబ్ల్యూపీటీ కుంట, నెమలినార మాను ప్రాంతంలో కళేబరాలను పూడ్చినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టారు. ఈ విషయమై చలమ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉదయ్‌దీప్‌ను శుక్రవారం 'సాక్షి' ఆరా తీయగా ట్రావెలింగ్‌లో భాగంగా షాక్‌కు గురికావడం, ఇతర కారణాలతో మూడు దుప్పులు మృతి చెందగా పోస్టుమార్టం నిర్వహించామన్నారు. మిగిలిన 26 దుప్పులను అడవిలో వదిలేశామన్నారు. పరిసరాల్లో ఓ కళేబరం కనిపించగా పరీక్షించి, సీసీ కెమెరాల ఆధారంగా కుక్కల దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లు, స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న ఎస్ఐ సురేష్‌బాబు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామ సమీపంలోని నల్లమల అడవిలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నారాయణరెడ్డి, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేశారన్నారు. ఆత్మకూరుకు చెందిన ఈశ్వర్, రవి, కరవేన రాజేష్ గాంబ్లింగ్ ఆడిస్తున్నారన్నారు. సిద్ధాపురం సామేలు, ఇస్కాల వెంకటరమణ, విజయ్‌చంద్ర, చిన్న మద్దిలేటి, గుంతకందాల శివకుమార్, వెంకటాపురం శంకర్‌రెడ్డి, పంత జూటూరు చెన్నకృష్ణుడులను పట్టుకున్నామన్నారు. కాగా ఆత్మకూరు ఈశ్వర్, రవి, సత్యం, రాజేష్, రవి, సింగవరం సత్యం, ఓబులేసు, సంతజూటూరు చాంద్‌బాషా, రియాజ్ పారిపోయారన్నారు. వారి నుంచి రూ.75,000 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పింఛన్ల పంపిణీలో మొరాయించిన సర్వర్



జూపాడుబంగ్లా సచివాలయం-2 వద్ద పింఛన్ డబ్బులకోసం పడిగాపులు కాస్తున్న అవ్వా, తాతలు

జూపాడుబంగ్లా: శుక్రవారం నవంబర్ ఒకటో తేదీ కావటంతో ఇంటి వద్దకొచ్చి పింఛన్ పంపిణీ చేసే సారొళ్లకోసం అవ్వా, తాతలు ఎదురుచూడసాగారు. సర్వర్ పనిచేయక పింఛన్ల పంపిణీ నిలిచిపోయిందని తెలుసుకొన్న కొందరు పింఛన్‌దారులు సచివాలయం వద్దకు చేరుకుని మధ్యాహ్నం 12గంటల వరకు సర్వర్ మొరాయించటంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 12గంటల తరువాత సర్వర్ పనిచేయటంతో అధికారులు పంపిణీ ప్రారంభించారు. సాయంత్రం 5గంటల సమయానికి 92శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మండలంలోని 12గ్రామపంచాయతీల్లో 4,972 పింఛన్లు మంజూరు కాగా 4,574 పింఛన్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా..మండలంలోని మండ్లెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే జయసూర్య పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మోహన్‌రెడ్డి, జంగాలపెద్దన్న, రమణారెడ్డి పాల్గొన్నారు.

- పాములపాడు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీకి సర్వర్లు మొరాయించాయి. శుక్రవారం ఉదయం నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే సర్వర్లు మొరాయించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేదేమిలేక సచివాలయాలకు వెళ్లారు. తమకు పింఛన్ ఇవ్వలేదని పింఛన్‌దారులు గ్రామ సచివాలయం వద్దకు చేరుకొని గంటల తరబడి ఎదురు చూశారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత సర్వర్ పనిచేయడంతో పింపిణీ కొనసాగించారు. మండలంలో 93.14 శాతం పంపిణీ పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు.

- **36 తగ్గిన పింఛన్లు..**

అక్టోబర్ నెలతో పోలిస్తే ఈ నెల 36 పింఛన్లు తగ్గాయి. అక్టోబర్ నెలలో మండలంలో 5,800 మందికి రూ.2,39,66,500 పంపిణీ చేయాల్సి ఉంది. కాగా ఈ నెలలో 5,764 మందికి రూ.2,38,08,000 మంజూరైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మద్దూరు, మిట్టకందాల గ్రామాల్లో పింఛన్ పంపిణీని పరిశీలించారు.

- పగిడ్యాల:మండలంలో శుక్రవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్వర్ మొరాయిండంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంటల తరబడి అధికారుల వద్ద పడిగాపులుకాశారు. మధ్యాహ్నం నుంచి సర్వర్ పని చేయడంతో కొంత మందికి మాత్రమే నగదు అందజేశారు.
- కొత్తపల్లి: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. 92 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు.
- బండిఆత్మకూరు: మండలంలో శుక్రవారం సర్వర్ మొరాయించడంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం గ్రామ సచివాలయాల సిబ్బంది పింఛన్ పంపిణీకి ఉపక్రమించారు. కాసేపటికే సర్వర్ మొరాయించడంతో తలలుల పట్టుకున్నారు. కానీ సాయంత్రానికంతా మండలంలో 95 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు.
- మహానంది: సర్వర్లు మొరాయించడంతో పింఛన్‌దారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయా ల్సి వచ్చింది. మండలంలో 5,198 పింఛన్లు ఉండ గా సాయంత్రానికి 4,867 పింఛన్లు పంపిణీ చేసి నట్లు మండల పరిషత్ ఏఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



ఆకాశదీపం పూజలు చేస్తున్న పండితులు

మహానంది: స్థానిక ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పూజల్లో భాగంగా ఈఓ ఎస్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు ధ్వజస్తంభం పైన ప్రత్యేక ఇత్తడి పాత్రలో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు



పూజలందుకున్న అభయాంజనేయస్వామి

ఆత్మకూరు: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సామూహిక కుంకుమార్చన, నక్షత్ర హారతి, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పారిశుద్ధ్య కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యా బడ్జెట్ అంచనాలు 2024–25 సంవత్సరానికి ఆయాలు, నైట్ వాచ్‌మెన్ వేతనాలకు, మరుగుదొడ్ల శుభ్రతకు నిధులు మంజూరైనా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం తగదన్నారు.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు: ఆర్డీఓగా నాగజ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పూజల కలకలం



భైరవుడి విగ్రహం ముందు పూజలు చేసిన దృశ్యం

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రం పరిధిలోని సప్తశివాలయాల వెనుక భాగంలో ఉన్న వేపచెట్టు కింద కాళభైరవుడు వెలిశాడు. గురువారం అర్ధరాత్రి నంద్యాల పట్టణానికి చెందిన కొందరు కాళభైరవుడి విగ్రహం ముందు పెద్ద అరటి ఆకుపై నైవేద్యం పెట్టి, పసుపు, కుంకుమ, గుమ్మడికాయలను పగలగొట్టి పూజలు చేశారు. ఈ పూజలకు స్థానిక ఆలయ పురోహితుడు ఒకరు, అతనితోపాటు సిబ్బంది సహకరించినట్లు సమాచారం. ఈ పూజలు క్షుద్రపూజలా?, గుప్తనిధుల కోసం చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగమంతా ఓ గిరిజనుడు చూశాడని, పూజల విషయం ఎవరికీ చెప్పకుండా ఉండాలని కొంత సొమ్ము ముట్టజెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామలింగారెడ్డిని వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమర జీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివి

వెలుగోడు: ప్రత్యేక రాష్ట్రం, మద్యపాన నిషేధం, హరిజనుల ఆలయ ప్రవేశం, జైళ్ల సంస్కరణల కోసం జీవితాంతం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఆర్యవైశ్య నాయకులు బళ్లాని వెంకట సత్యనారాయణ అన్నారు. సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్, తాళ్లూరి రవికుమార్, మారం సంపత్, లాలం మల్లికార్జున, కుమార్, బాల నర్సయ్య, విశ్వనాథం, లాలం నాగార్జున, నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నందికొట్కూరు: అమరవీరుల స్మారక సభలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ డివిజన్ కార్యదర్శి మజీద్‌మియ్యా పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వడ్డేపేట స్కూల్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన బొల్లవరం, 9న వేంపెంట గ్రామంలో జరిగే అమరవీరుల స్మారక సభలను విజయవంతం చేసేందుకు ప్రజలు తరలిరావాలని కోరారు. ఆది, మౌలాలి, చూరిబీ, మరిస్వామి, నాగార్జున పాల్గొన్నారు.